క్లుప్తంగా

అమరచింత మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు

అమరచింత: మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నల్గొండ జిల్లా హూస్నాబాద్ మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు పదోన్నతిపై అమరచింత కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు నూతన కమిషనర్‌కు మున్సిపాలిటీ సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని నాగరాజు పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పాన్‌గల్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రాఘవేందర్‌కు మంజూరైన రూ.21 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం మాజీ సర్పంచ్ మహేష్‌నాయుడు అందజేశారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన మంత్రి జూపల్లి, కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

పాన్‌గల్: మండలంలోని వివిధ సబ్‌సెంటర్ల పరిధిలో కొనసాగుతున్న సమగ్ర ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సీహెచ్‌ఓ రామయ్య సూచించారు. గురువారం మండలంలోని చింతకుంట సబ్‌సెంటర్ పరిధిలో ఎక్స్‌రే, క్షయవ్యాధి నిర్ధారణకు స్ఫూటమ్ సేకరణ, హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు నాగరాజు, జిల్లా టీబీ నిర్ధారణ సిబ్బంది, వైద్య సిబ్బంది ఇస్తేరమ్మ, రామచందర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజం కోసం పాటుపడటం గొప్ప విషయం



వనపర్తిటౌన్: సమాజ శ్రేయస్సు, అభ్యున్నతికి పాటుపడటం గొప్ప విషయమని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఇటీవల డాక్టరేట్ పొందిన కంటె నిరంజనయ్య, బండారు శ్రీనివాసులును గురువారం జిల్లా కేంద్రంలోని రేడియంట్ హైస్కూల్‌లోని సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జనజ్వాల, సాహితీవేత్తలు బైరోజు చంద్రశేఖర్, దేశి రాములుయాదవ్, గంధం నాగరాజు, హెచ్.బాలస్వామి, పావనం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఆత్మకూర్: మండలంలోని జూరాల గ్రామానికి చెందిన కుర్వ చిన్న కర్రెన్న (55) ఈనెల 15 నుంచి కనిపించకుండా పోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సాహు మహరాజ్ సేవలు మరువలేనివి

వనపర్తిటౌన్: చదువే సమాజాన్ని మారుస్తుందని నమ్మిన ఛత్రపతి సాహు మహరాజ్ సేవలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సాహు మహారాజ్ 151వ వర్ధంతిని మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, గాయకుడు కురుమయ్య, నాయకులు మండ్ల దేవన్న నాయుడు, శ్రీనివాసులుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాల శుభ్రత పాటించి దోమల నివారణకు కృషి చేయాలని కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. గురువారం 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. చెత్తను బయట పారబోయకుండా చెత్త డబ్బాల్లో వేసి చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలన్నారు. అనంతరం కుక్క కాటుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ తదితర అంశాలపై కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే జీవితం నాశనం



జిల్లా కేంద్రంలో పచ్చజెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వాడకం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత సిగరెట్, మందు, గంజాయి వంటి మత్తు పదర్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఒక్కసారి తాగితే అదే అలవాటుగా మారి తన జీవితంతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను నాశనం చేసినవారవుతారని హెచ్చరించారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల అనారోగ్యానికి గురి కావడంతో పాటు బంగారం లాంటి జీవితం నాశనం అవుతుందన్నారు. మాదక ద్రవ్యాలను జిల్లాలో అడుగుపెట్టనీయకుండా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాదకద్రవ్యాలు వాడినా లేదా విక్రయించినా చట్ట ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం మాదకద్రవ్యాలను వాడమని, ఎక్కడైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇస్తామని యువతతో ప్రమాణం చేయించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాన్‌గల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పోస్టర్ మేకింగ్ పోటీ నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతి కేజీబీవీ 9వ తరగతి విద్యార్థిని సింధు, ద్వితీయ బహుమతి చిక్కేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని నందిని, తృతీయ బహుమతి పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని వాణి విజేతలుగా నిలిచినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో(ఎన్‌ఎస్‌ఎస్) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ఎస్‌ఐ హరిప్రసాద్, షీటీం ఎస్‌ఐ అంజద్, శిక్షణ ఎస్‌ఐ బిందు హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన మానసిక, శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. యువత ఆరోగ్యంగా ఉంటే దేశం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుష్మ, రామరాజుయాదవ్ పాల్గొన్నారు.



వనపర్తిలో మాట్లాడుతున్న శిక్షణ ఎస్‌ఐ బిందు

ప్రజల ఆమోదంతోనే రోడ్డు విస్తరణ



దుకాణాదారుల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు

వనపర్తిటౌన్: వనపర్తి–కర్నూల్ రోడ్డులో విస్తరణలో భాగంగా ఆక్రమణలను తొలగించాలని కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం రోడ్డు విస్తరణలో నష్టపోయే బాధితులతో గురువారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా దుకాణాదారులు మాట్లాడుతూ.. పట్టణంలో మిగతా రోడ్లను ఎంత మేర విస్తరించారో అంతే విస్తరించాలని, పాలిటెక్నిక్ రోడ్డు నుంచి బస్టాండ్‌కు వెళ్లే కుడి వైపు మార్గంలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని, అక్రమ నిర్మాణాలను తొలగించిన తర్వాతే తమ దుకాణాలను తొలగించాలని కోరారు. ఆక్రమణల వైపు అడుగు నెలమట్టం చేస్తే తమ వైపు అంతే తొలగించుకుంటామన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు దుకాణాదారుల నిర్మాణ అనుమతి పత్రాలపై ఆరా తీశారు. అలాగే పుర నిబంధనలకు అనుగుణంగా సెట్ బ్యాక్ వదిలి ఎన్ని నిర్మాణాలు జరిగాయనే అంశాలను బాధితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆమోదంతోపూ విస్తరణ ప్రక్రియ చేపడతామని సూచించారు.

బకాయి బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న బాల్యానాయక్

పాన్‌గల్: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్ (బీఎఎస్‌ఎస్)లో చదువుతున్న ఎస్టీ, ఎస్సీ విద్యార్థులకు అందించాల్సిన బకాయి బిల్లులు వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బాల్యానాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం రెండు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.154 కోట్ల నిధులు రావాల్సి ఉందన్నారు. వెంటనే వాటిని విడుదల చేసి ఆయా విద్యార్థులు చదువుకు దూరం కాకుండా చూడాలన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయని పక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాబు నాయక్, చిట్టెమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు నాణ్యమైన భోజనం



ఖిల్లాఘనపురంలో విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

వనపర్తి రూరల్: పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గౌని ప్రమోదిని సూచించారు. గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి పెబ్బేరు మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, యుగంధర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మౌలిక వసతులు కల్పించాలి

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని బీఆర్‌ఎస్వీ నాయకులు అన్నారు. బీఆర్‌ఎస్వీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని సోళీపురం, ఖిల్లాఘనపురం, మానాజీపేట తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యార్థుల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శేఖర్, లక్ష్మణ్‌గౌడు, శివప్రసాద్‌గౌడ్, నవాజ్ షరీఫ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చదవడం, రాయడంలో మెరుగుపర్చాలి

విద్యార్థులను చదవడం, రాయడంలో మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని ఎంఈఓ జయశంకర్ అన్నారు. మండలంలోని రోడ్డుమీదితండా, బోడగట్టుతండా, వసురాంతండా, మల్కిమియాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలు, అల్లమాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్గీకరణను పకడ్బందీగా అమలుచేయాలి



సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

గోపాల్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చట్టంలో పేర్కొన్న విధంగా గ్రూప్–1, 2, 3 ప్రకారం కులధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయాలన్నారు. ఉద్యోగ నియామకాలు, ప్రభుత్వ అన్ని శాఖల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం ప్రకారమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ తర్వాత జరుగుతున్న ఎమ్మార్పీఎస్ 37 ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కొమ్ము చెన్నకేశవులు, అద్దాకుల పవన్‌కల్యాణ్, గట్టు స్వామి, మీసాల నాగరాజు, మొలకలపల్లి పరుష రాముడు, వనపర్తి జిల్లా అధ్యక్షుడు వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతానికి చర్యలు

పాన్‌గల్: మహిళా సంఘాలకు అన్ని రకాల రుణాలు అందించి వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి చిట్టెమ్మ కోరారు. గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో గ్రామ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళా సమాఖ్య సభ్యురాలు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. అలాగే తండాకు సంబంధించి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెంట్లవెల్లిలో ఉన్న బ్యాంకుకు వెళ్లడం ఇబ్బందిగా మారిందని తండా సమీపంలో ఉన్న కేతేపల్లి ఎస్‌బీఐ బ్యాంకుకు తమ ఖాతాలను మార్చాలని గ్రామ సంఘంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జీపీ కంటే పార్టీ ముఖ్యం



వనపర్తిటౌన్: గవర్నమెంట్ ప్లీడర్ పోస్టు కంటే కాంగ్రెస్ పార్టీయే తనకు ముఖ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయుడు, వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీపీ డి.కిరణ్‌కుమార్ అన్నారు. డీసీసీ కోసం తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని ఎమ్మెల్యే మేఘారెడ్డికి విన్నవించగా జీపీ పోస్ట్ ఉంది కదా అని ఎమ్మెల్యే అన్నట్లు తెలిపారు. నాలుగు నెలల్లోనే జీపీని వదులుకునేందుకు సిద్ధమైన తన చిత్తశుద్ధిని గుర్తించాలని సూచించినట్లు తెలిపారు. వనపర్తిలో డీసీసీ ఎంపికపై రోజుకో పేరు ప్రాచుర్యంలోకి వస్తున్న నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కిరణ్‌కుమార్ మాట్లాడారు. 40ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ లో చిత్తశుద్ధితో, నిజాయతీగా పని చేస్తున్నానని నికార్సు అయిన కార్యకర్తగా తాను డీసీసీ పదవికి అర్హుడిగా భావిస్తున్నట్లు తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు త్వరగా నిర్మించుకోవాలని, బిల్లులు సకాలంలో విడుదల చేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. గురువారం మండలపరిధిలోని మూలమల్ల గ్రామంలో పలువురికి ఇళ్లు మంజూరు కాగా మార్కింగ్ వేసి ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ఆరోగ్యం పదిలం

వనపర్తిటౌన్: అప్రమత్తతో జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో 100 రోజుల కార్యచరణలో భాగంగా గురువారం వీధి, పెంపుడు కుక్కలు, తడి, పొడి వ్యర్థాల విభజన, ఏబీసీ ప్రచారం, డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే విధంగా ఎస్‌హెచ్‌జీ కొత్త సంఘాల ఏర్పాటు సర్వే, ట్రేడ్ లైసెన్స్ రెసిడెన్సియల్ నుంచి కమర్షియల్ మార్పిడి, భువన్ సర్వే, పాలిటెక్నిక్ రోడ్డులోని డెస్లిల్ ఇసుక తొలగింపు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, డీఎంసీ బాలరాజు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి



సీడీపీఓ లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కొత్తకోట: అంగన్ వాడీలలో పనిచేసే టీచర్లందరినీ క్రమబద్ధీకరించాలని అంగన్ వాడీ మండల అధ్యక్షురాలు వనజ కుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆత్మకూర్ సీడీపీఓ లక్ష్మమ్మ, కొత్తకోట అంగన్‌వాడీ సూపర్ వైజర్ కవితకు వినతి పత్రం అందజేశారు. అంగన్ వాడీ టీచర్లకు రూ.32 వేలు వేతనం చెల్లించాలని, హెల్పర్‌కు రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. అలాగే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు సావిత్రి, రేవతి, మాధవి, తస్లీం, అరుణ, బాలేశ్వరమ్మ, దీనమ్మ, పార్వతి, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించండి



ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ వేస్తున్న విజయవర్ధన్ రెడ్డి

వనపర్తి రూరల్: పెబ్బేరు మున్సిపాలిటీలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి , ఇందిరమ్మ కమిటీ సభ్యులు సూచించారు. పట్టణంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు గురువారం వారు భూమిపూజ చేసి నిర్మాణం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు లబిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్రాములు యాదవ్, నాయకులు దయాకర్‌రెడ్డి, రాంరెడ్డి, నరేందర్, గంధం రంజిత్ కుమార్ సత్యానారాయణరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యుత్ పనులు త్వరగా పూర్తి చేయాలి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల

వనపర్తి రూరల్: పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయి లీల, కార్యదర్శి లక్ష్మి కోరారు. ఈ మేరకు గురువారం వనపర్తి రూరల్ ఏఈ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యుత్ పనులు పూర్తి కాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సాంకేతిక కారణాలతోనే పనులు నిలిచిపోయాయని, వెంటనే మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాయని ఏఈ వారికి వివరించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి రేణుక, కాలనీవాసులు రేణుక, సుశీలమ్మ, పార్వతి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, సామగ్రి పంపిణీ



విద్యార్థులకు బ్యాగ్స్, నోట్‌బుక్స్ అందజేస్తున్న స్నేహ ఫౌండేషన్ నిర్వాహకులు

కొత్తకోట రూరల్: ప్రతి వ్యక్తి జీవితంలో విద్య ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని స్నేహ ఫౌండేషన్ బ్రాంచ్ మేనేజర్ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దమందడి మండలం వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డితో కలిసి స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఏటా స్నేహ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు అందజేస్తూ పాఠశాల విద్యను ప్రోత్సహించడానికి స్నేహ ఫౌండేషన్ తన వంతు కృషి చేస్తుందన్నారు. పేద విద్యార్థులకు ప్రోత్సాహం లభిస్తే చదువులపై దృష్టి సాధించి, మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాణం విష్ణు, ప్రేమ్‌సాగర్, మల్లికార్జున్, శ్రీనుసాగర్, కొండన్న గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంఘ సభ్యులు సమన్వయంతో వ్యవహరించాలి



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

వీపనగండ్ల: మహిళా సంఘాల సభ్యులు సమన్వయంతో వ్యవహరించి శ్రీనిధి బ్యాంకుల ద్వారా అందుతున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమైఖ్య సీసీ వీరయ్య అన్నారు. గురువారం కల్వరాల్ల గ్రామంలో గ్రామ మొదటి మహిళా సంఘ అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మొత్తం 33 చిన్న సంఘాల సభ్యులు తీసుకున్న అప్పులను సకాలంలో చెల్లిస్తేనే తిరిగి ఎలాంటి షరతులు లేకుండా రెట్టింపు రుణాలు పొందవచ్చని సూచించారు. సంఘ అధ్యక్షురాలిగా చటమోని తిరుపతమ్మ, కార్యదర్శిగా బండారు నాగేషమ్మ, కోశాధికారిగా సత్తూరు రమాదేవీ, ఉపాధ్యక్షురాలిగా బండారు లక్ష్మి, సహాయ కార్యదర్శిగా చటమోని సంధ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఓఏ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ విగ్రహావిష్కరణకు తరలిరండి



సాయి విగ్రహ ఆవిష్కరణ సభాస్థలిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు

అమరచింత: తెలంగాణ గాయకుడు సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీ సాయిచంద్ కోరారు. ఈ మేరకు గురువారం కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో తనదైన గాణంతో ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని నింపుతూ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంతో ప్రత్యేక భూమిక పోషించిన సాయిచంద్‌ను యావత్తు తెలంగాణ మరువలేదన్నారు. సాయి యాదిలో నిర్వహించే కార్యక్రమంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలన్నారు.

సభాస్థలిని పరిశీలించిన మాజీ మంత్రి

అమరచింతలో ఈనెల 29న జరిగే సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వస్తుండడంతో సభాస్థలిని శుక్రవారం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రజనీ సాయిచంద్‌తో కలిసి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ డిపాజిట్లు గల్లంతు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

కొత్తకోట రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని వనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి అన్నారు. పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికలపై కార్యకర్తలు, నాయకులతో గురువారం సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులు ప్రజల్లో ఉనికిని కోల్పోతుండడంతోనే కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డిలు పనిచేస్తున్నారన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు 70 లక్షల మంది రైతులకు తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతు భరోసా డబ్బులు జమచేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రేషన షాపుల ద్వారా సన్నబియ్యం ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామి, గౌని వెంకటేశ్వర్ రెడ్డి, బాబురెడ్డి, రమేష్ యాదవ్, రాధాకృష్ణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.